క్లుప్తంగా

నేడు రుణమాఫీ చెక్కుల పంపిణీ

కపిలేశ్వరపురం: మండలంలోని వడ్లమూరు, నిడసనమెట్ల గ్రామాలకు చెందిన వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులకు ఆదివారం రుణమాఫీ పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు డీఆర్‌డీఏ ఏపీఎం గోలి దుర్గాప్రసాద్ శనివారం తెలిపారు. వడ్లమూరులో ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో రెండు గ్రామాల లబ్ధిదారులనుద్దేశించి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు మాట్లాడతారన్నారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ప్రారంభిస్తున్న లీడ్ మేనేజర్ శ్యాంబాబు తదితరులు

కె.గంగవరం: ప్రస్తుతం సైబర్ క్రైమ్స్ ఎక్కువగా జరుగుతున్నాయని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆర్థిక అక్షరాస్యత పెంపొందించుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా లీడ్ మేనేజర్ కె.శ్యాంబాబు అన్నారు. కె.గంగవరంలో శనివారం రిజర్వ్ బ్యాంక్ డిపాజిటర్ ఎడ్యుకేషన్, ఎవేర్నెస్ ఫండ్, యూనియన్ బ్యాంక్ వారి సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ఆర్థిక నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. డిజిటల్ ట్రాన్సాక్షన్స్ ద్వారా లావాదేవీలు చేసుకోవాలని ఈ విషయాలు తెలుసుకోవడానికి ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలు ఉపయోగపడతాయని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ రవీంద్రకుమార్, డీఆర్‌డీఏ ఏపీడీ అన్నపూర్ణ, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోఆర్డినేటర్ అశోక్‌బాబు, కౌన్సిలర్ కిషోర్, కోటేశ్వరి, గణేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభం



ఆలయం వద్ద హోమం నిర్వహిస్తున్న పండితులు

కె.గంగవరం: మండలంలోని కూళ్ల పంచాయతీ శివారు తమ్మయ్యపాలెంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంతో పాటు విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు శనివారం ఉదయం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 19 వేద పండితుల బ్రహ్మత్వంలో విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపారు. ప్రతిష్ఠా మహోత్సవాల సందర్భంగా నేటి నుంచి మూడు రోజుల పాటు ఆలయం వద్ద హోమాలతో పాటు పలు ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం ఆలయం వద్ద భారీ అన్నదానం జరుగుతుందని గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

300 మందికి హోమియో మందు పంపిణీ



అర్తమూరులో హోమియో మందు వేస్తున్న ప్రముఖులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం అర్తమూరుకు చెందిన ఎస్‌బీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సత్తి బుల్లిస్వామిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో 300 మందికి ఉచితంగా హోమియో మందులను పంపిణీ చేశారు. ట్రస్టు నిర్వహణలోని 168వ ఉచిత హోమియో శిబిరాన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రామవరం బ్రాంచ్ సీనియర్ మేనేజర్ ఎం.చైతన్య, సబ్ మేనేజర్ కె.సురేష్ ప్రారంభించారు. 28 సంవత్సరాలుగా ట్రస్టు ద్వారా విద్యా, వైద్య రంగాల్లో సేవలందిస్తున్న చైర్మన్ బుల్లి స్వామి రెడ్డిని ప్రశంసించారు. శిబిరంలో రాజమహేంద్రవరంలోని అల్లు రామలింగయ్య వైద్య కళాశాల వైద్యులు కె.విజయకుమారి, పి.శిరీష, ఎల్. స్నేహలత, ఎం.వీరభద్రరావు, పి.పద్మావతి, అనపర్తికి చెందిన వైద్యులు సుమామాధురి సేవలందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ సత్తి లక్ష్మణ్ రెడ్డి, కన్వీనర్లు తాడి కోదండ రామారెడ్డి, సభ్యులుసత్తి సత్యనారాయణరెడ్డి, వెలగల శివారెడ్డి, తాడి సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

19న వలంటీర్లకు సత్కారం

రామచంద్రపురం రూరల్: మండలంలో సేవలందిస్తున్న వలంటీర్లకు ఈ నెల 19న మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో సత్కారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్వీ రామచంద్రమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన ఉదయం 10 గంటలకు జరుగనున్న కార్యక్రమానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు హాజరు కావాల్సిందిగా కోరారు.

ముందే మేల్కొంటే మేలు

- కుష్ఠు వ్యాధిపై గ్రామాల్లో కొనసాగుతున్న అవగాహన
- 2027 నాటికి వ్యాధి నిర్మూలనే లక్ష్యం
- అందుబాటులో బహుళ ఔషధ చికిత్స
- 21 వరకూ ప్రత్యేక కార్యక్రమాలు



అంగరలోని ప్రైవేటు కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీపీఎం వెంకటేశ్వర్లు

కపిలేశ్వరపురం: కుష్ఠు వ్యాధిని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నాయి. గతేడాది జూలైలో వ్యాధిగ్రస్తుల గుర్తింపు లక్ష్యంగా ప్రత్యేక సర్వేను చేపట్టాయి. ఈ ఏడాది జనవరి 30 నుంచి ఈ నెల 21 వరకూ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. 2027 నాటికి కుష్ఠు రహిత సమాజాన్ని నెలకొల్పాలన్న లక్ష్యంతో సాగుతున్న కార్యక్రమంపై ఈ కథనం.

ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు

గతేడాది జూన్ 16 నుంచి జూలై 16 వరకూ వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించే లక్ష్యంతో సర్వే నిర్వహించారు. జిల్లాలో 1,408 సర్వే బృందాలు పనిచేశాయి. కపిలేశ్వరపురం మండలం అంగర పీహెచ్‌సీ పరిధిలో 18 బృందాలు, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీలలో 19 చొప్పున బృందాలు సర్వే చేశాయి. రామచంద్రపురం ఆస్పత్రి పరిధిలో ఎనిమిది కేసులను గుర్తించగా, వారికి ప్రాథమిక చికిత్సను అందించారు. సర్వే కొనసాగింపుగా ఈ ఏడాది జనవరి 30న గాంధీ వర్ధంతి రోజున స్పర్శ పేరుతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నెల 21 వరకూ సమావేశాలు, వ్యాధి లక్షణాలను గుర్తించడం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

రెండు నియోజకవర్గాల్లో వ్యాధి తీవ్రత ఇలా..

ఐదు కన్నా తక్కువ మచ్చలున్న వారిని పాసి బ్యాచిలర్ కేసుగా, ఐదు కన్నా ఎక్కువ మచ్చలుండే వారిని మల్టీబ్యాచిలర్ కేసుగా పరిగణిస్తారు. పీబీ కేసులకు ఆరు నెలలు, ఎంబీ కేసులకు ఏడాది పాటు మందులు వాడాల్సి ఉంటుంది. రామచంద్రపురం లెప్రసీ ఆస్పత్రి పరిధిలో ఇటీవల నాలుగు పీబీ, మరో నాలుగు ఎంబీ కేసులను గుర్తించారు. కాజులూరు మండలం దుగ్గుదూరు పీహెచ్‌సీ పరిధిలో ఐదుగురు, గొల్లపాలెం పీహెచ్‌సీలో 22 మంది, రామచంద్రపురం అర్బన్ పరిధిలో 32, ద్రాక్షారామ పీహెచ్‌సీలో 30, వెల్లలో 24. కె.గంగవరం మండలం పామర్రు పీహెచ్‌సీలో 24, మండపేట అర్బన్ పీహెచ్‌సీలో 22, కపిలేశ్వరపురం మండలం వాకతిప్ప పీహెచ్‌సీలో 13, అచ్యుతాపురంలో 18, అంగరలో18, ఆలమూరు మండలం పెదపళ్ల పీహెచ్‌సీలో 15, చొప్పెళ్లలో 16 మంది వ్యాధిగ్రస్తులకు చికిత్సనందిస్తున్నారు.

వైద్య సేవల యంత్రాంగం

సాధారణ రోజుల్లో క్షేత్ర స్థాయిలో ఆశా, వైద్యారోగ్య కార్యకర్తల ద్వారా వ్యాధి తాలూకు అవగాహన కార్యక్రమాలకు ప్రాథమిక సేవకులుగా ఉంటారు. ఎవరికైనా లక్షణాలు కనిపిస్తే వీరిని సంప్రదించాలి. ప్రతి పీహెచ్‌సీలోనూ ఎంపీహెచ్ఎస్ స్థాయి ఉద్యోగిని నోడల్ పర్సన్‌గా నియమించారు. వారిని డీపీఎంఓ స్థాయి అధికారి షెడ్యూల్ ప్రకారం ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. పీహెచ్‌సీ జిల్లా స్థాయిలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారు. డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ టీంను డీఎస్ఎంఓ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారు. ప్రతి నెలా 10న వ్యాధిగ్రస్తులకు చికిత్స చేసి, కౌన్సెలింగ్ ఇస్తారు.

లక్షణాలను బట్టి బహుళ ఔషధ చికిత్స

కుష్ఠు వ్యాధికి అధునిక చికిత్స పద్ధులున్నాయి. తొలుత వ్యాధి గ్రస్తులు మానసికంగా ధృడంగా ఉండాలి. మైక్రో బ్యాక్టీరియా ప్రభావంతో ఈ వ్యాధి సోకుతుంది. శరీరంపై రాజరంగు మచ్చలొస్తాయి. ఆ మచ్చపై వెంట్రుకలు రాలిపోతాయి. దురద, స్పర్శ, నొప్పి ఉండవు. ఈ ప్రారంభ లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆశా, ఏఎన్ఎంలకు చెప్పాలి. వ్యాధి నిర్ధారణ అయితే బహుళ ఔషధ చికిత్సనందిస్తారు. పుండ్లు ఉన్న వారికి అవసరమైతే కత్తిపూడిలోని రిఫరల్ లెప్రసీ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేస్తారు.

ప్రాథమికంగా గుర్తిస్తే మేలు



"ప్రతి పీహెచ్‌సీలోనూ కుష్ఠు వ్యాధి కార్యక్రమాలను పర్యవేక్షించే లక్ష్యంతో నోడల్ పర్సన్లను ప్రభుత్వం నియమించింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీపీఎంఓ స్థాయి అధికారి పర్యవేక్షణలో కళాశాల, పాఠశాలలు, జనావాసాలకు వెళ్లి వ్యాధి లక్షణాలను వివరిస్తున్నాం. ఈ నెల 21 వరకూ అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తాం."

– వెన్నేటి వెంకటేశ్వరరావు, నోడల్ పర్సన్, అంగర పీహెచ్‌సీ

విశ్వాసం కోల్పోతున్న రాజకీయాలకు ఊపిరి

ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్



శలపాకలో స్థానికులతో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్

కాజులూరు: టీడీపీ నాయకుల అబద్ధపు హామీలతో ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన రాజకీయాలకు ముఖ్యమంత్రి జగనన్న ఊపిరిపోశారని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. మండలంలోని తణుకువాడ, శలపాక, డేగలపేట తదితర గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి నాయకులు, కార్యకర్తలు ప్రజలను కలుసుకున్నారు. శలపాకలో ఆయన మాట్లాడుతూ గతంలో రాజకీయ నాయకులు ఎన్నికల్లో అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక సగం కూడా అమలు చేసేవారు కాదన్నారు. దీంతో ప్రజల్లో రాజకీయనాయకుల మాటలపై నమ్మకం సన్నగిల్లిందన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబునాయుడు 640 వరకూ హామీలిచ్చి కేవలం 40 హామీలు కుడా అమలు చేయలేదన్నారు. దీంతో ప్రజలు రాజకీయనాయకుల మాటలు చీదరించుకునే పరిస్థితి వచ్చిందన్నారు. అయితే పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని నవరత్నాల్లో భాగంగా ఇచ్చిన హామీలతో పాటు అదనంగా మరో 50 కొత్త పథకాలు అమలు చేశారన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో దేశం తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమైనప్పటికీ జగనన్న సంక్షేమ పథకాలను ఎక్కడా ఆపలేదన్నారు. చేయగలిగేదే చెబుతామని, చెప్పినవన్నీ చేస్తామని మేనిఫెస్టోలో జగనన్న ప్రకటించారని చంద్రబాబునాయుడు మాదిరి అబద్ధపు హామీలతో మోసం చేయగలిగితే 2014లోనే తామ పార్టీ అధికారంలోకి వచ్చేదన్నారు. నాయకులు, పార్టీ కార్యకర్తలు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి జగనన్న పథకాల ద్వారా ఏపీ కుటుంబానికి ఎంతెంత లబ్ధి చేకూరిందో వివరిస్తూ ప్రభుత్వ పథకాలు వారు మరింత సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పలు స్థానిక సమస్యలను ప్రజలు రాజ్యసభ సభ్యుడు బోస్ దృష్టికి తీసుకురాగా వాటిపై ఆరా తీసి పరిష్కారానికి వెంటనే తగు చర్యలు తీసుకోవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ పోతుల గనిరాజు, ఎంపీటీసీ దడాల రమేష్, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ పోలినాటి సూర్యచంద్రం, పీఏసీఎస్ చైర్మన్లు పితాని సుబ్రహ్మణ్యం, సత్తి శ్రీరామారెడ్డి, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని అమలు చేసిన నాయకుడు జగన్

- జగన్ వెంటే ప్రజలు
- కో ఆర్డినేటర్ సూర్యప్రకాష్



పట్టణంలోని ముచ్చుమిల్లిలో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వంలో పాల్గొన్న సూర్యప్రకాష్ తదితరులు

రామచంద్రపురం: నవరత్న పథకాలు అమలు చేయలేరని, చేస్తే రాష్ట్ర అప్పుల పాలవుతుందని ప్రతిపక్షాలు నానా యాగీ చేస్తే పేదల సంక్షేమం కోసం సంక్షేమ పథకాలు అమలు చేసి చూపించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. పట్టణంలోని 17వ వార్డు ముచ్చుమిల్లిలో గడపగడపకు మన ప్రభుత్వంలో సూర్యప్రకాష్ పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి అయిదేళ్ల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పరంగా పొందిన లబ్ధిని వివరిస్తూ 2024లో మళ్లీ వైయస్సార్ సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాల అమలు కోసం తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం గురించి ప్రజలకు ప్రతి ఇంటికీ వెళ్లి వివరించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పేదల సంక్షేమం కోసం దేశంలో ఏ నాయకుడు చేయని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి పరిపాలనను ప్రజల చెంతకు చేర్చారు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా అత్యధికంగా రూ.3 వేల పింఛన్‌గా ఒకటో తేదీనే ప్రతి ఇంటికీ తెల్లవారుజామునే వలంటీర్లు వెళ్లి అందించే విధంగా వినూత్న ప్రక్రియను సీఎం అమలు చేశారని ఆయన అన్నారు. రైతులు ఎంటువంటి కష్టం లేకుండా ఆర్బీకేలను ఏర్పాటు చేసి రైతు సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేశారన్నారు. ఇంత సంక్షేమం జరుగుతుంటే ఓర్వలేని ప్రతి పక్షాలు మూకుమ్మడిగా ఎన్నికల్లో వచ్చేందుకు వస్తున్నారని, వారిని తిప్పికొడుతూ వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్‌కు పూలమాలలు హారతులతో పెద్ద ఎత్తున మహిళలు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పట్టణ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, కౌన్సిలర్లు కేతా సుజాత, కేతా శ్రీను, ఎం.సీతామహాలక్ష్మి, వివిధ వార్డు కౌన్సిలర్లు, పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, వార్డు నాయకులు మొలకపాటి రాజబాబు, కుడుపూడి బుజ్జి, కుడుపూడి శ్రీను, చీకట్ల అర్జున్, పలివెల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయే అభివృద్ధి చేశాం

సచివాలయ భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్సీ త్రిమూర్తులు



వెంటూరులో మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: వైఎస్సార్ సీపీ పాలనలో చరిత్రలో నిలిచిపోయే అభివృద్ధి చేశామని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. మండలంలోని వెంటూరు, కూర్మాపురం గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితులు తలెత్తినా సంక్షేమ పథకాలను కొనసాగించిన ఘతన ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా నేరుగా ప్రజల ఖాతాలకే లబ్ధి వేసిందన్నారు. తొలుతగా వెంటూరు సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు ఆధ్వర్యంలో రూ.80లక్షలతో నిర్మించిన సచివాలయం-1, సచివాలయం -2 భవనాలను ఎమ్మెల్సీ త్రిమూర్తులు ప్రారంభించారు. కూర్మాపురంలో సర్పంచ్ చౌటుపల్లి చక్రవేణి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే వెంటూరు, కూర్మాపురం గ్రామాల్లో ఆసరా చెక్కులను మహిళా శక్తి సంఘాలకు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్‌లు నున్న ప్రదీప్‌కుమార్, ఈత కోట లక్ష్మణరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీలు వాసంశెట్టి విజయకుమార్, వాసంశెట్టి విజయలక్ష్మి, పోలీస్ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టరు వాసంశెట్టి అనంతలక్ష్మి, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి రాధాకృష్ణ, పరంశెట్టి వెంకటరమణ, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నప్రసాద భవనం ప్రారంభం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరాలయం ప్రాంగణంలో దాతలు సత్తి సుబ్బారెడ్డి, కుమారులు నిర్మించి అన్నప్రసాద భవనం నేటి ఉదయం 10.42 గంటలకు ప్రారంభమవనున్నట్లు ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు శనివారం విలేకరులకు తెలిపారు.

ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శ

కపిలేశ్వరపురం (మండపేట): ఆప్తులను కోల్పోయి బాధల్లో ఉన్న మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాలకు చెందిన పలువురుని ఎమ్మెల్యే వేగుళ్ల శనివారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అంగరకు చెందిన ఇంటర్మీడియెట్ విద్యార్థి పడాల అఖిల్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదే గ్రామ ప్రముఖుడు తోరాటి వెంకన్న, తోరాటి సుబ్బారావు, ఏడిద నారాయణమ్మ కుటుంబాల సభ్యులను పరామర్శించారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

- ఎమ్మెల్యే వేగుళ్లకు ఎమ్మెల్సీ తోట సవాల్
- చెప్పుకునేందుకు చేసిందేమీ లేక ప్రొటోకాల్ రాద్ధాంతం
- ఎమ్మెల్యే తీరు హాస్యాస్పదమన్న పాపారాయుడు, రాజుబాబు



మండపేటలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట, పాపారాయుడు, రాజుబాబు

కపిలేశ్వరపురం (మండపేట): టీడీపీ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వాల హయాంలో ఎంతెంత అభివృద్ధి అయ్యిందో, సంక్షేమాన్ని అమలు చేశారో చర్చించేందుకు సిద్ధమా అని టీడీపీ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సవాల్ విసిరారు. నియోజకవర్గానికి వరుసగా మూడు దఫాలుగా ఎమ్మెల్యేగా ఉన్న వేగుళ్ల చేసిందేమీ లేదన్నారు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ హయాంలో పేద, మధ్య తరగతి ప్రజల ప్రయోజనాలు గతంలో ఎన్నడూ లేని విధంగా మెరుగుపడ్డాయన్నారు. ఈ విషయాన్ని క్షేత్ర స్థాయిలో నిరూపించేందుకు తాను సిద్ధమని, ఎమ్మెల్యే వేగుళ్ల అందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. మండపేటలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, రైతు విభాగం కార్యదర్శి రెడ్డి రాజుబాబు, పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్సీ మాట్లాడారు. తన హయాంలో నియోజకవర్గంలో రూ.ఐదు కోట్లతో విద్యుత్ మరమ్మతు పనులు, విద్యుదీకరణ అభివృద్ధి పనులు చేపడుతుండగా ఆ పనులపై రాద్ధాంతం చేయడం ఎమ్మెల్యేకు తగదన్నారు. టిడ్కో ప్లాట్ల కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షత వహించగా, అది ప్రొటోకాల్‌కు విరుద్ధమంటూ చిన్నపిల్లాడిలా మారాం చేయడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. వార్డు పరిధిలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వేగుళ్ల పాల్గొన్నప్పుడు ప్రజలు ఎన్నుకున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌ను కాదని తన పార్టీకి చెందిన వార్డ్ ఇన్‌చార్జిలను వేదికపై కూర్చోబెట్టుకుంటున్న ఎమ్మెల్యే వేగుళ్లకు ప్రొటోకాల్ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. టిడ్కో గృహాల నిర్మాణంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం పాల్పడిన అవినీతి, అక్రమాలను నిరూపించేందుకు తాను సిద్ధమన్నారు. తాను నియోజకవర్గ బాధ్యతలను చేపట్టాక రూ.5 కోట్లతో విద్యుత్ శాఖ పనులను చేపట్టానన్నారు. సోమేశ్వరం, ద్వారపూడి గ్రామాల్లో సబ్‌స్టేషన్లు కట్టించామన్నారు. అర్తమూరు గ్రామానికి రూ.30 లక్షలతో త్రీ ఫేజ్ కరెంట్ సరఫరా చేస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు మాట్లాడుతూ పదే పదే వైఎస్సార్ సీపీ నాయకులను ఎమ్మెల్యే వేగుళ్ల బెదిరిస్తున్నారని, ఆయన తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదన్నారు. రెడ్డి కులస్తుణ్ణి అయిన తనను అణగదొక్కాలన్న అక్కసుతో వేగుళ్ల ఉన్నారన్నారు. 2011 నుంచి వైఎస్సార్ సీపీ నాయకుడిగా తాను ఎమ్మెల్యే అక్రమాలను అడ్డుకుంటూ వచ్చానని, ఆ అక్కసుతో తనపై కేసులు సైతం పెట్టి వేధించిన ఘనుడు ఎమ్మెల్యే అన్నారు. తాను ప్రభుత్వ కార్యక్రమాల వేదికపై కూర్చోవడాన్ని తప్పుబడుతున్న ఎమ్మెల్యే అదే ప్రభుత్వ వేదికలపై ఆయన అల్లుడు సాయికుమార్‌ను ఏ అర్హత ఉందని కూర్చోబెట్టుకుంటున్నారో ప్రజలకు చెప్పాలని పాపారాయుడు ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రెడ్డి రాజుబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి నుంచి ప్రజల దృష్టిని పక్కదారి పట్టించే కుట్రలో భాగంగానే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. తాను చేసిన పనులేమైనా ఉంటే ప్రజలకు చెప్పుకోవచ్చని, అది కాకుండా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను తప్పుబట్టడం తగదన్నారు. ఎమ్మెల్యేగా బిక్కన కృష్ణార్జున చౌదరి ఉన్నప్పుడు పాఠశాల ప్రారంభానికి ఎమ్మెల్యేను కాదని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న వి.విమలకుమారి అధ్యక్షత వహించాలని చెప్పిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తుంచుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, సర్పంచ్‌లు బూరిగ ఆశీర్వాదం, మట్టపర్తి గోవిందరాజు, కౌన్సిల్ విప్ పోతంశెట్టి వరప్రసాద్, కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ పలివెల సుధాకర్, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ కన్వీనర్లు పిల్లా వీరబాబు, ముమ్మిడివరపు బాపిరాజు, నాయకులు కుడుపూడి రాంబాబు, పాలంకి కమల పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారికి కండువా వేసి ఆహ్వానిస్తున్న కోఆర్డినేటర్ సూర్యప్రకాష్

కె.గంగవరం: మండలంలోని పాణింగపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శనివారం రామచంద్రపురం వైఎస్సార్‌సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కొత్తపల్లి వెంకటరావు(చినబాబు), ఒంటిపల్లి వెంకటరావులతో పాటు పలువురుని కోఆర్డినేటర్ సూర్యప్రకాష్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు మేలు చేస్తుందని పార్టీ విజయానికి తమవంతు కృషి చేస్తామన్నారు. పార్టీ నాయకులు చిట్టూరి చిన్ని, వల్లభరెడ్డి చిన్ని, రాయుడు కృష్ణ, నీలం సత్యకృష్ణ, వంటిపల్లి సత్యనారాయణ, సర్పంచ్ పంపన సత్యానందం, నానాపరపు శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శిగా 'దొమ్మలపాటి'



దొమ్మలపాటి సత్యనారాయణ

రామచంద్రపురం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శిగా పట్టణానికి చెందిన న్యాయవాది వైఎస్సార్ సీపీ నాయకుడు దొమ్మలపాటి సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఇటీవల విడుదల చేసిన పార్టీ లీగల్ సెల్ కమిటీలో తనను కార్యదర్శిగా నియమించినట్లు సత్యనారాయణ శనివారం స్థానిక విలేకరులకు తెలిపారు. తనను ఈ పదవికి సిఫారసు చేసిన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు, లీగల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశానుసారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానని దొమ్మలపాటి తెలిపారు.

వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా జాఫర్



రామచంద్రపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మైనారిటీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా ద్రాక్షారామకు చెందిన ఎండీ జాఫర్ హుస్సేన్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు అందుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కొత్తపేటకు చెందిన షేక్ ఖాజా బాబుతో పాటు జాఫర్‌ను ఈ పదవిలో నియమిస్తూ ఉత్తర్వులు పంపించారు. జాఫర్ ప్రస్తుతం జిల్లా వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శిగానూ సేవలు అందిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానని జాఫర్ చెప్పారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రికి, రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణకు, నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్‌లకు ధన్యవాదాలు తెలిపారు.


బావిలో మహిళ మృతదేహం లభ్యం



దొంగల వరలక్ష్మి (ఫైల్)

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో ఈ నెల 14న అదృశ్యమైన మహిళ మృతదేహం శనివారం ఉదయం బావిలో లభ్యమైంది. ద్రాక్షారామ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ద్రాక్షారామకు చెందిన దొంగల వరలక్ష్మి (30) ఈనెల 14న ఉదయం నుంచి కనిపించడం లేదని ఆమె భర్త నరసింహమూర్తి శుక్రవారం ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే శనివారం ఉదయం వీరి ఇంటికి సమీపంలో బెస్తపేట వీధిలో ఒక బావి నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు మృతదేహం ఉన్నట్లు గుర్తించి పోలీసులకు తెలిపారు. ద్రాక్షారామ ఎస్సై జి. సురేంద్ర బాబు సిబ్బందితో వచ్చి బావి నుంచి మృతదేహాన్ని బయటకు తీయించారు. భర్త, బంధువులు వరలక్ష్మి మృతదేహంగా గుర్తించడంతో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన ధర్మారెడ్డి

రాయవరం: సోమేశ్వరం గ్రామ పరిధిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సోమేశ్వరం నుంచి కుతుకులూరు వెళ్లే రహదారిలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సోమేశ్వరం గ్రామానికి చెందిన పులగం ధర్మారెడ్డి(70) రోడ్డుపై వెళుతుండగా మోటార్‌సైకిల్ ఢీకొంది. దీంతో రహదారి పక్కనే ఉన్న కట్టెలపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మోటార్ సైకిలిస్ట్ ఢీకొన్న అనంతరం ధర్మారెడ్డిని రోడ్డు పక్కకు లాగి వెళ్లి పోయినట్లుగా దూరం నుంచి చూసిన స్థానికులు చెబుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే ధర్మారెడ్డి ఒక్కడే కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఢీకొన్న వాహనం ఏమిటన్నది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది. రాయవరం ఎస్సై జి.నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం.